క్లుప్తంగా

యనమలకుదురులో స్వామివారికి కల్యాణం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆదివారం స్వామివారికి కల్యాణం అత్యంత వైభవంగా చేశారు. మాసశివరాత్రి, ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం 5 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఉదయం 10 గంటలకు సహస్ర లింగార్చన నిర్వహించారు. స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించి శివసాధంలో అశేష భక్తుల మధ్య స్వామివారికి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా చేశారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు పాల్గొన్నారు. ఈఓ ఎం.గంగాధరరావు ఆలయ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేద పిల్లలకు ఉచితంగా ట్యూషన్ సెంటర్ ప్రారంభం

పెనమలూరు: పిల్లలకు చదువుతో పాటు ఉన్నత విలువలు నేర్పాలని అమరావతి బాలోత్సవ్ గౌరవ అధ్యక్షుడు చలవాది మల్లికార్జున రావు అన్నారు. యనమలకుదురు 1వ వార్డులో శనివారం రాత్రి షేక్ రంగావలి భవన్, విశ్వమానవ సంక్షేమ సంఘం, అమరావతి బాలోత్సవ్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ట్యూషన్ సెంటర్ ప్రారంభించారు. ఇప్పటివరకు 28 ట్యూషన్ సెంటర్లు ప్రారంభించామన్నారు. విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పి.మస్తాన్‌రావు మాట్లాడుతూ కష్టపడి చదువుకునే వారు ఉన్నత స్థానాలకు వెళతారని తెలిపారు. కార్యక్రమంలో అమరావతి బాలోత్సవ్ కార్యదర్శులు పిన్నమనేని మురళీకృష్ణ, యూవీ రామరాజు, ప్రముఖులు షేక్ కాశిం, శ్రీహర్షిణి, ఎస్‌కె.జాన్‌బీ, బల్లా వెంకటేశ్వరరావు, పి.ఐజాక్, న్యూటన్ పాల్గొన్నారు.

పెద ఓగిరాలలో 200 మందికి వైద్యసేవలు



ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. రోటరీ హాస్పిటల్, అను హాస్పిటల్స్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాల ఆవరణలో గొంతు, క్యాన్సర్, ఎముకలు, నరాలు, దంత వైద్య సేవలు అందించారు. 200 మందికి ఉచితంగా అన్ని పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసీజీ, ఎకో, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు జరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పీహెచ్ వెంకటేశ్వరరావు, కార్యదర్శి నాగసుబ్రమణ్యం, కేసీపీ జీఎంలు వీవీ పున్నారావు, సీకే వసంతరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల సమర్పణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో తిరుపతమ్మ తల్లికి శాలివాహన మహిళలు సంప్రదాయం ప్రకారం ఆదివారం బోనాలు సమర్పించారు. గ్రామంలోని తిరుపతమ్మ తల్లి, గోపయ్య స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కుమ్మర కాలనీకి చెందిన కానూర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో మహిళలు బోనాలు తలపై పెట్టుకుని, శ్రీలక్ష్మీ అమ్మవారి ప్రతిమతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తిరుపతమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఏటా కుమ్మర కాలనీవాసులు అమ్మవారికి ఆషాఢంలో బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. కానూర్ల కుటుంబీకులు, బంధువులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద బందరు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట అయ్యప్పనగర్‌కు చెందిన ఈదర కుసుమ కుమారి స్కూటీపై విజయవాడకు వెళ్లి తిరిగి వస్తుండగా పాతచెక్‌పోస్టు సూపర్‌మార్కెట్ వద్దకు వచ్చిన సమయంలో వాహనాన్ని తప్పించపోయి అదుపుతప్పి ప్రమాదానికి గురై రోడ్డుపై పడిపోయింది. ఈ ఘటనలో ఆమె పళ్లు రెండు ఊడిపోయాయి. ఆమెను కానూరులో ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

కానూరుకు కృష్ణా జలాలు

- రూ 4.23 కోట్లతో పనులు
- ప్రతి ఇంటికీ కుళాయి


కానూరులో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకులు

పెనమలూరు: డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కానూరు పరిధిలో త్వరలో తాగునీరుకు కృష్ణా జలాలు సరఫరా చేయనున్నారు. ఈ మేరకు జలజీవన్ మిషన్ కింద రూ.4.23 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే వాటర్ ట్యాంకుల నిర్మాణం పనులు మొదలు పెట్టారు. త్వరలో కృష్ణానది నుంచి కానూరుకు తాగునీరు సరఫరా చేయటానికి పైప్‌లైన్ నిర్మాణం పనులు చేపట్టనున్నారు. కానూరులో ఇప్పటికే భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. పక్కనే ఆటోనగర్ ఉండటం, విజయవాడ కార్పొరేషన్ నుంచి వచ్చే మురుగునీరు కానూరు మీదుగా పారుదల జరగటంతో భూగర్భజలాలు పనికి రాకుండా పోయాయి. ఈ నేపథ్యంలో కృష్ణాజలాలు కానూరు గ్రామానికి సరఫరా చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చేసిన కృషి ఫలించనుంది.

రూ.2 కోట్లతో మూడు వాటర్ ట్యాంకులు

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.2 కోట్లతో మూడు వాటర్ ట్యాంకుల నిర్మాణం ప్రారంభించారు. ఒక్కో వాటర్ ట్యాంకు 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. శ్రీరామ్‌నగర్, మహదేవపురం కాలనీ, 80 అడుగుల రోడ్డు ప్రాంతంలో వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఈ మేరకు మొదటి దశ పనులు పూర్తిచేశారు. ఈ వాటర్ ట్యాంకుల నిర్మాణం మరో మూడు నెలల్లో పూర్తి చేస్తారు.

10 కిలోమీటర్ల మేర కృష్ణా పైప్‌లైన్

పెదపులిపాక నుంచి కృష్ణానది జలాలు కానూరుకు సరఫరా చేయటానికి 10 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌లు వేయనున్నారు. ఏడాది క్రితం కొంత పైప్‌లైన్ పనులు జరిగినా అవి అసంపూర్తిగా ఉన్నాయి. జలజీవన్ మిషన్ నిధులు రావటంతో ఇక పైప్‌లైన్ పనులు వేగంగా చేపట్టనున్నారు. గ్రామంలో ఇప్పటికే 12 ప్రాంతాల్లో వాటర్ ట్యాంకులు ఉన్నాయి. తులసీనగర్, సనత్‌నగర్, ఆర్టీసీ కాలనీ, చలసానినగర్, శ్రీరామ్‌నగర్, దళితవాడ, కమలమ్మ బజార్, వినాయక్‌నగర్, మురళీనగర్ వాటర్ ట్యాంకులకు కృష్ణా వాటర్ పైప్‌లైన్‌లు అనుసంధానం చేసి గ్రామంలో అన్ని ప్రాంతాలకు కృష్ణానది జలాలు అందిస్తారు.

ఉచిత కుళాయి కనెక్షన్‌లు

గ్రామంలో పలు హ్యాబిటేషన్‌లలో కుళాయి లేని వారికి ఉచిత కుళాయి కనెక్షన్‌లు ఇస్తారు. పైప్‌లైన్ పనులు ప్రారంభించిన తరువాత కుళాయి లేని ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చి తాగునీరు కొరత లేకుండా చర్యలు తీసుకుంటారు.

పెనమలూరు మండలంలో..

పెనమలూరు మండలంలో అదనంగా రూ.82 లక్షలతో వాటర్ ట్యాంకుల నిర్మాణం పనులు చేపట్టారు. మండలానికి కూడా జలజీవన్ మిషన్ కింద నిధులు మంజూరు అయ్యాయి. పెనమలూరులో రూ.22 లక్షలతో 40 వేల లీటర్ల ట్యాంకు, ఇదే గ్రామం ప్రకృతి హోమ్ వద్ద రూ.25 లక్షలతో 60 వేల లీటర్ల ట్యాంకు, వణుకూరు దళితవాడలలో రూ.35 లక్షలతో 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణం చేస్తారు. ఈ ప్రాంతాల్లో కూడా ఉచితంగా కుళాయి కనెక్షన్‌లు ఇస్తారు.

> **నాలుగు నెలల్లో పనులు పూర్తి చేస్తాం**
>
> వచ్చే నాలుగు నెలల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తాం. కుళాయి లేనివారికి కుళాయి కనెక్షన్‌లు ఉచితంగా ఇస్తాం. కానూరుకు కృష్ణా జలాలు అందిస్తాం.
>
> –ఊకోటి శ్రీనివాస్, ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్

మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయం


వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచి, గౌసాని

అల్లాపురం(గన్నవరం): ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. మండలంలోని అల్లాపురంలో ఆదివారం క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత వైద్య శిబిరాన్ని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బీ.జాన్‌వెస్లీతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. అనంతరం అనగాని మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఆవుటపల్లి రమేష్‌పాల్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ ద్వారా గత 20 ఏళ్లుగా చేస్తున్న సేవలు ప్రశంసనీయమని జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని పేర్కొన్నారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి డొక్కు సాంబశివవెంకన్నబాబు, ఉప సర్పంచి ఆవుటపల్లి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఏఎస్ఆర్. కోటేశ్వరరావు, ట్రస్ట్ డైరెక్టర్లు ఏ.పద్మజ, ప్రియదర్శిని, కాదేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

100 మందికి దంత వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: దంత సంరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని దంత వైద్య నిపుణురాలు డాక్టర్ యువ ప్రశాంతి అన్నారు. హనుమాన్‌జంక్షన్ కిరణ వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దంత సంరక్షణ చర్యలపై కిరణ వర్తకులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు ఉదయం, మళ్లీ రాత్రి నిద్రపోయే ముందు క్రమం తప్పకుండా పళ్లు శుభ్రపర్చుకోవాలని చెప్పారు. సుమారు 100 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఎ.గోపికృష్ణ, హనుమాన్‌జంక్షన్ కిరణా వర్తక సంఘం అధ్యక్షుడు రాగిపిండి లక్ష్మీరెడ్డి, వాసవీక్లబ్ అధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పామర్తినగర్, రైస్‌మిల్ బజారు, రాజీవ్‌నగర్ కాలనీ, ఎస్టీబీఎల్ కాలనీ, మల్లికార్జున స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం హనుమాన్‌జంక్షన్ పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ సీపీడీసీఎల్ ఏఈ ఎ.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక నూజివీడు రోడ్డు, కృష్ణానగర్, ఐటీఐ రోడ్డు, మహాత్మగాంధీ నగర్, రైల్వే స్టేషన్ ఏరియాల్లో ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కంప్యూటర్ వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆదిత్య బధిరుల విద్యాశిక్షణాలయం నిర్వాహకులు అభినందనీయులని దాత అల్లం దుర్గారావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదిత్య బధిరుల విద్యాశిక్షణాలయానికి అల్లం దుర్గారావు రూ.22 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్ సమకూర్చారు. ఈ ప్రింటర్‌ను నిర్వాహకులు ఆకుల వెంకటరమణకు ఆదివారం అందించారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్‌శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు పొట్లూరు శేషాచలం, వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, చక్కా సుబ్బారావు, నారగాని కొండలరావు పాల్గొన్నారు.

నేడు స్పందన

విజయవాడరూరల్: స్పందన కార్యక్రమం విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా స్పందన కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ బ్రాంచ్ పూర్వ విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 1988–1992 సంవత్సరంలో మెకానికల్ బ్రాంచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో జరిగింది. ఆనాడు చదువుకున్న సమయంలో చేసిన అల్లరి, మధుర స్మృతులను పూర్వ విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. దీంతో కళాశాలలో సందడి వాతావరణం నెలకొంది. తమకు అప్పుడు చదువు చెప్పిన అధ్యాపకులు రమణ, రాకేష్, భానుమూర్తి, మధుసూదనరావులను కలుసుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి మాట్లాడుతూ ..కళాశాలలో ఒకప్పుడు చదువుకున్న విద్యార్థులందరూ ఇలా కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు జోజిబాబు, వెంకట్రావ్, శ్రీధర్, జానకి రామ్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

కాలువలకు జలకళ

- నీటితో నిండుగా ప్రవహిస్తున్న కాలువలు
- పంటబోదెల్లోనూ నీటి పరవళ్లు
- ఊపందుకున్న ఖరీఫ్ పనులు


నీటితో నిండుగా ప్రవహిస్తున్న బందరు కాలువ


నిండుకుండలా రైవస్‌కాలువ


తూర్పు కృష్ణాకు నీటిని మళ్లించే ప్రధానమైన కోమటిగుంట రెగ్యులేటర్


నీటితో నిండిన ప్రొద్దుటూరు చానల్

కాలువలు నీటితో నిండుగా ప్రవహిస్తూ జలకళతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం వరుసగా ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగుకు ముందుగానే కాలువలకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంది. దీంతో ప్రధాన కాలువలు, అనుబంధ పంట కాలువలు ప్రస్తుతం నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని తూర్పు కృష్ణా ప్రాంతానికి నీటిని మళ్లించే కోమటిగుంట రెగ్యులేటర్ ద్వారా ప్రధాన చానల్స్‌కు నీటిని మళ్లిస్తున్నారు. కంకిపాడు సెక్షన్ పరిధిలోని కంకిపాడు లాకులు నుంచి బందరు కాలువకు వచ్చిన నీటిని అనుబంధ కాలువలకు విడుదల చేస్తున్నారు. కాలువలపై ఆధారపడి సాగు చేస్తున్న ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరంగా సాగిస్తున్నారు.

–కంకిపాడు

ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే


యనమలకుదురు దేవస్థానం అభివృద్ధి పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వస్వామివారి దేవస్థానంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆదివారం పరిశీలించారు. యనమలకుదురు దేవస్థానంలో అనేక అభివృద్ధి పనులు దాత సంగా నరసింహారావు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఆలయం ఘాట్ రోడ్డు విస్తరణ, వాహనాల పార్కింగ్‌కు స్థలం, ప్రాకారం విస్తరణ, కోనేరు నిర్మాణం, ఆలయంలో స్వర్ణ తాపడం ఇతర అభివృద్ధి పనులు అడిగి తెలుసుకున్నారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు, ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు జరుగుతున్న పనుల వివరాలు తెలిపారు. కరకట్ట వద్ద ఉన్న ఆలయ భూమి ఎకరానికి చుట్టూ అధికారులు కంచె నిర్మాణం చేశారని, రాకపోకలకు మార్గం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకు వచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వినతి


నున్నలో జామ్ అయిన ట్రాఫిక్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తరుచుగా ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మ్యాంగో మార్కెట్ నుంచి లోకల్ బైపాస్ రోడ్డు నుంచి వెళ్లవలసిన భారీవాహనాలు గ్రామం లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా కోటకట్ట సెంటర్ కార్నర్, చినరావిచెట్టు సెంటర్, రావిచెట్టు కార్నర్‌ల వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవడం కష్టమవుతోంది. రోడ్డు వెంబడి షాపులకు వచ్చే వారు రోడ్డు పైనే వాహనాలను పార్కు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. లోకల్ బైపాస్ రోడ్డు వద్ద అర్‌అండ్‌బీ అధికారులు యారోమార్కు చేసి భారీవాహనాలను, నాన్‌స్టాప్ బస్సులను మళ్లించినట్టయితే ట్రాఫిక్ సమస్య ఉండదు. ట్రాఫిక్ పోలీసులు చెరువు సెంటర్‌తో పాటు ఉదయం, సాయంత్రం కోటకట్ట సెంటర్‌లో కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. నున్న గ్రామంలో జగనన్న కాలనీ వద్దకు వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో కోటకట్ట సెంటర్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి కేసులో ఉన్న వారిపై రౌడీషీటు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేసిన సీఐ కిషోర్‌బాబు


పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ కిషోర్‌బాబు

పెనమలూరు: గంజాయి అక్రమ రవాణా చేసినా, గంజాయి తాగినా రౌడీషీట్లు తెరుస్తామని పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు స్పష్టం చేశారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌లో 47 మందిపై రౌడీషీట్లు ఉన్నాయన్నారు. వారిపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు స్వస్తి పలికి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని జీవించాలన్నారు. ప్రవర్తన సక్రమంగా ఉన్న వారిపై రౌడీషీట్లు రద్దు చేస్తామని తెలిపారు. ఇక గంజాయి తాగినా, అక్రమ రవాణా చేసినా వారిపై రౌడీ షీట్లు తెరవడమే కాక కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి పై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. గంజాయి కేసుల్లో ఉన్న 37 మందిపై కొత్తగా రౌడీషీట్లు తెరుస్తామని తెలిపారు. శాంతభద్రతలకు భంగం కలిగించే ఎవరిని ఉపేక్షించమన్నారు.ఈ కార్యక్రమంలోఎస్‌ఐలు రాజేష్, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల రైతుల హర్షం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అసైన్డ్ భూముల రైతులు

గన్నవరం: అసైన్డ్ భూములపై సంబంధిత రైతులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు స్థానిక శాసన సభ్యుని కార్యాలయం వద్ద ఆదివారం సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ అసైన్డ్ భూముల రైతులు క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్ చేసి 20 సంవత్సరాలు పూర్తయిన భూములపై సర్వహక్కులు కల్పిస్తూ మంత్రి వర్గం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు మేలు జరుగుతుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. పేద వర్గాల పట్ల సీఎం వైఎస్.జగన్ ప్రత్యేక శ్రద్ధకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం ఒక నిదర్శనమన్నారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, సర్పంచి డొక్కు సాంబ శివ వెంకన్నబాబు, పార్టీ నాయకులు జలసూత్రం రామ్మోహన్‌రావు, బీ. రాజశేఖర్‌రెడ్డి, ఎంపీఆర్, కుర్రాటి అరుణకుమారి, గొంది రాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు..విజయవాడ కొత్తపేటకు చెందిన ఎం.భాస్కర లక్ష్మీనారాయణ, సుధారాణి భార్యాభర్తలు. ఆదివారం ద్విచక్రవాహనంపై మచిలీపట్నం అత్తవారింటికి వెళ్తుండగా ప్రొద్దుటూరు అడ్డరోడ్డు సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పటంతో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సుధారాణి (33) ఒక్కసారిగా ఎగిరి కిందపడింది. దీంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే చనిపోయింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరాలపై విస్తృత దాడులు

కంకిపాడు: పేకాట శిబిరాలపై కంకిపాడు పోలీసులు ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. సేకరించిన వివరాల ప్రకారం...మండలంలోని ఉప్పలూరు గ్రామ పరిధితో ఖాళీ స్థలాల్లో పేకాట శిబిరం నడుస్తున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడులు నిర్వహించగా పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1940 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

ఈదుపుగల్లులో...

మండలంలోని ఈదుపుగల్లు గ్రామ పరిధిలోని పుట్టకట్ట వద్ద కోతముక్క ఆడుతున్నట్లు సమాచారం అందటంతో ఆ ప్రాంతంపై దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్‌ఐ లక్ష్మి తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): న్యూ కళాక్షేత్ర నృత్యశాలకు చెందిన చిన్నారులు ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 32 మంది చిన్నారులు దుర్గమ్మ సన్నిధిలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నృత్య ప్రదర్శన ఇచ్చారు. పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేశారు.